క్లుప్తంగా

రామాలయం వీధిలో అన్నసమారాధన



అన్నసమారాధనలో భక్తులకు భోజనాలు వడ్డిస్తున్న రామాలయం వీధి వాసులు

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు హనుమంతవాక దరి రామాలయం వీధిలో వినాయక ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కాలనీవాసులు స్వామిని దర్శించుకుని పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేపట్టారు. రామాలయం వీధితో పాటు హనుమంతవాక, విశాలాక్షినగర్ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు బోనం శ్రీనివాసరావు, బోనం గోవింద రాజు, ఎస్.ముఖేష్, శ్రీనివాసరావు, ఎస్.వెంకటరావు, చిన్న శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన ఆటో డ్రైవర్లు



పార్టీలో చేరిన ఆటోడ్రైవర్లతో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, తదితరులు

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 19వ వార్డుకు చెందిన 50 మంది ఆటో యూనియన్ సంఘం నాయకులు, ఆటో డ్రైవర్లు వైఎస్సార్‌సీపీలో చేరారు. శుక్రవారం లాసన్స్ బే కాలనీలోని ఎంపీ ఎంవీవీ కార్యాలయంలో వారికి ఎంపీ, పార్టీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. 19వ వార్డు పార్టీ నాయకుడు సూరాడ దాసు ఆధ్వర్యంలో వీరంతా వైఎస్సార్‌సీపీలో చేరారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా రంజక పాలనకు ఆకర్షితులమై పార్టీలోని చేరినట్లు వారు వెల్లడించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ అఖండ విజయానికి కృషి చేయాలని ఈ సందర్భంగా వారికి ఎంపీ ఎంవీవీ పిలుపునిచ్చారు. ఈ కార్యాక్రమంలో గణేష్, వసంత, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'వ్యక్తిగత సమస్యలతో సంతాన లేమి'



మాట్లాడుతున్న డాక్టర్లు కావ్య, కీర్తి

బీచ్ రోడ్డు: వ్యక్తిగత సమస్యలే సంతానలేమికి కారణం అవుతున్నాయని డాక్టర్లు కావ్య, కీర్తి తెలిపారు. ఇటీవల కాలంలో సంతానలేమి సమస్యలు అధికమవుతున్నాయని, జనాభాలో 10 శాతానికి పైగా ఈ సమస్యతో బాధ పడుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించిందన్నారు. ప్రస్తుత రోజుల్లో విచ్చలవిడి ఆహారపు అలవాట్ల మార్పునకు కూడా సంతానలేమికి కారణమన్నారు. ఈ సమస్య నుంచి గట్టెక్కేందుకు ఆధునిక టెక్నాలజీ అందుబాటులో ఉందని, నూతన చికిత్స విధానం ద్వారా సంతానలేమి సమస్యలను అధిగమించవచ్చునని తెలిపారు.

శ్మశానవాటిక శుభ్రత



శ్మశానవాటికను శుభ్రం చేయిస్తున్న పీతల గోవింద్

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డులోని శ్మశాన వాటికను శుక్రవారం జీవీఎంసీ సిబ్బంది జేసీబీతో శుభ్రం చేశారు. శ్మశానవాటిక అధ్వాన పరిస్థితిని తెలుసుకున్న మేయర్ గొలగాని హరి వెంకటకుమారి వెంటనే జీవీఎంసీ సిబ్బందికి శుభ్రం చేయాలని ఆదేశించారు. దీంతో పోలీసు హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్ పర్యవేక్షణలో శ్మశానవాటిక పరిసరాలను శుభ్రం చేశారు.



డిజిటల్ విధానంలో బోధన చేస్తున్న అధ్యాపకులు




ఆకర్షణీయంగా వీఎంఆర్‌డీఏ పార్కు



చినవాల్తేరులో రోడ్డు నిర్మాణం

అభివృద్ధి మంత్రం

- 20వ వార్డులో ప్రజలకు ఉపయుక్తంగా పనులు
- రూ1.29 కోట్ల వ్యయంతో రహదారుల నిర్మాణం
- రూ.5 కోట్లతో బీచ్ రోడ్డుకు వెళ్లే రహదారి విస్తరణ
- నాడు–నేడు కింద రూ.76 లక్షలతో పాఠశాలల అభివృద్ధి
- రూ.15 లక్షలతో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు



పూర్తిగా ఆధునికీకరించిన వీఎంఆర్‌డీఏ పార్క్



విస్తరించిన పోలమాంబ ఆలయం రోడ్డు

ఏయూ క్యాంపస్: అభివృద్ధి మంత్రం.. ప్రజలకు ఉపయుక్తం అనే నినాదంగా స్థానిక 20వ వార్డులో నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. అత్యంత ప్రధానమైన రహదారుల నిర్మాణానికి పెద్దపీట వేశారు. వీధుల్లో అవసరమైన సీసీ రోడ్లు, ప్రధానమైన తారురోడ్లు పెద్ద ఎత్తున నిర్మాణం చేపట్టారు. పెదవాల్తేరు, చినవాల్తేరులో విస్తరించిన ఈ వార్డులో ప్రజలకు అవసరమైన విధంగా జీవీఎంసీ అందించిన రూ.96 లక్షలు, గడప గడపకు నిధులు రూ.33 లక్షలు రహదారుల నిర్మాణానికి వెచ్చించారు. స్మార్ట్ సిటీ నిధులు రూ.3 కోట్లతో రహదారులు, ఫుట్‌పాత్‌లు, ఇతర వసతుల కల్పనకు వెచ్చించారు.

- పోలమాంబ ఆలయం నంచి వీఎంఆర్‌డీఏ పార్కుకు వెళ్లే రహదారిని పూర్తి స్థాయిలో విస్తరించారు. 60 అడుగుల రహదారిని 100 అడుగులకు విస్తరించారు. శరవేగంగా పనులను పూర్తి చేసి ప్రస్తుతం వినియోగంలోకి తీసుకొచ్చారు. దాదాపు రూ.5 కోట్ల వరకు ఇందు కోసం వెచ్చించారు.
- పాఠశాలల అభివృద్ధికి రూ.76 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసింది. వార్డులోని కేడీపీఎం ఉన్నత పాఠశాలలో మౌలిక వసతుల కల్పనను రూ.56 లక్షలు వెచ్చించారు. 800 మంది విద్యార్థులు చదువుకుంటున్న ఈ పాఠశాలలో ఎలక్ట్రికల్ మరమ్మతులు, మరుగుదొడ్లు, మంచినీటి సరఫరా వ్యవస్థ, సివిల్ రిపేర్లు, ఫర్నిచర్, వాల్ పెయింటింగ్స్ వంటి వసతుల కల్పనకు ఖర్చు చేశారు. శివాజీపాలెం ప్రాథమిక పాఠశాలకు రూ.20 లక్షలతో అదనపు వసతులు కల్పించారు.
- వార్డులో ప్రజల ఆరోగ్యానికి ఉపయుక్తంగా నిలిచే విధంగా పలు పార్కులను అభివృద్ధి చేశారు. ఓపెన్ జిమ్‌లను మూడు పార్కుల్లో ఏర్పాటుకు దాదాపు రూ.15 లక్షలు వెచ్చించారు. బీచ్ రోడ్డులో ప్రధాన ఆకర్షణగా నిలిచే వీఎంఆర్‌డీఏ స్మార్ట్ సిటీ పార్కు(వుడా పార్కు)ను రూ.33 కోట్లతో సకల వసతులతో విదేశీ పార్కులను తలపించే రీతిలో తీర్చిదిద్దారు.
- వార్డులో వీధి కుళాయిలు, కాలువల మరమ్మతులు, నిర్మాణం పూర్తి స్థాయిలో చేపట్టారు. జీవీఎంసీ నిధులతో వీటిని ఆధునికీకరించారు. వార్డులో తలపెట్టిన అర్బన్ ప్రాథమిక హెల్త్ సెంటర్(యూపీహెచ్‌సీ) నిర్మాణం సైతం తుది దశకు చేరుకుంది.

నలువైపులా అభివృద్ధి



వార్డులో ఎటువైపు వెళ్లినా రహదారులు, ఫుట్‌పాత్‌లు, కాలువలు పూర్తిగా ఆధునికీకరణ జరిగింది. ప్రజల అవసరాలను గుర్తిస్తూ ఎప్పటికప్పుడు అభివృద్ధి పనులు చేపడుతున్నారు. మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇచ్చారు.

– రాచకొండ దశరథరామయ్య, పెదవాల్తేరు

ప్రజలకు అన్ని వసతులూ కల్పన



వార్డులో ప్రజల అవసరాలకు అనుగుణంగా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. రహదారులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశాం. డ్రైనేజీలు, పార్కులను ఆధునికీకరించాం. 20వ వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దాం.

– ముప్పల లక్ష్మి, 20వ వార్డు కార్పొరేటర్

10వ వార్డులో ఎంవీవీ సహపంక్తి భోజనం



సహపంక్తి భోజనం చేస్తున్న ఎంపీ ఎంవీవీ

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు ఇందిరానగర్‌లో శుక్రవారం విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ పర్యటించారు. వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి స్థానికులతో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలు వల్ల కలిగిన లబ్ధి గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానికుడు కె.కృష్ణ నివాసంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పతివాడ వెంకటలక్ష్మి, స్థానిక నాయకులు బొండా శ్రీనివాసరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

13వ వార్డులో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డులో శుక్రవారం మజీద్ గరీబ్ నవాజ్ మసీదు పెద్దలు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ విందులో విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు. ముందుగా ముస్లిం పెద్దలతో కలిసి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విందులో గాజువాక అసెంబ్లీ ఎన్నికల పరిశీలకుడు ఫరూకీ, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు కెల్ల సత్యనారాయణ, పిల్లి వీర్రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ముస్లింల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేశారన్నారు.

అసమానతలకు పరిష్కారం అవసరం



ప్రసంగిస్తున్న రిజిస్ట్రార్ ఎం.జేమ్స్ స్టీఫెన్

ఏయూ క్యాంపస్: సమాజంలో అసమానతలను రూపుమాపాల్సిన అవసరం ఉందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఏయూ సెంటర్ ఫర్ సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇన్‌క్లూజివ్ పాలసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల సదస్సు 'అండర్ స్టాండింగ్ సోషల్ ఎక్స్‌క్లూజన్ ఇన్ ఇండియా–ఎమర్జింగ్ చాలెంజెస్ ఇన్ సోషల్ ఇన్‌క్లూజన్'ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ దేశంలో కులం ప్రజల మధ్య అడ్డుగోడలు నిర్మిస్తూ వేరు చేస్తోందన్నారు. ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ సమాజంలో సామాజిక, ఆర్థిక అసమానతలను తొలగించే విధంగా ప్రభుత్వాలు కృషి చేయాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, ఆచార్య వై.చిన్నారావు, కేంద్రం సంచాలకులు డాక్టర్ పి.సుబ్బారావు, డాక్టర్ ఎన్.బాబా వలి, డాక్టర్ బి.శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి ఘనంగా క్షీరాభిషేకం



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.శ్రీనివాసులరెడ్డి తెలిపారు. అలాగే కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసి పూజ నిర్వహించనున్నామని చెప్పా రు. పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,500 చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో ఈవో శ్రీనివాసులరెడ్డి, ఏఈవో తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

చోరీల నియంత్రణకు రాత్రి గస్తీ



రాత్రి గస్తీలో ఫోర్త్‌టౌన్ క్రైం ఎస్‌ఐ భాస్కరరావు, యువకులు

సీతమ్మధార: నగరంలో జరుగుతున్న దొంగతనాలను అరికట్టేందుకు ఫోర్త్‌టౌన్ క్రైం ఎస్‌ఐ భాస్కరరావు ఆధ్వర్యంలో అర్ధరాత్రి గస్తీ పెంచారు. స్థానిక యువకుల సహాయంతో దొంగతనాలు జరగకుండా చర్యలు చేపట్టారు. క్రైం సిబ్బందితోపాటు యువకులు రాత్రి పూట అన్ని ప్రాంతాల్లో గస్తీ తిరుగుతూ ఎటువంటి చోరీలు జరగకుండా చూస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ భాస్కరరావు మాట్లాడుతూ నేరాలు, దొంగతనాల నియంత్రణకు సిబ్బందితోపాటు ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో ఉన్న యువకులతో కలిసి రాత్రి గస్తీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రశాంతంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

ఏవీఎన్‌లో ఎన్‌సీసీ 13(ఏ) బెటాలియన్ కార్యాలయం



లెఫ్టినెంట్ కల్నల్ నీరజ్‌కుమార్‌తో ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు తదితరులు

దాబాగార్డెన్స్: స్థానిక ఏవీఎన్ కళాశాలలో 13(ఏ) బెటాలియన్ ఎన్‌సీసీ నూతన కార్యాలయం శుక్రవారం ప్రారంభమైంది. 13(ఏ) బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ నీరజ్‌కుమార్ పాల్గొని, కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్యాడెట్లు మరింత క్రమశిక్షణతో మెలగాలని, కళాశాలకు, ఎన్‌సీసీ విభాగానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని సూచించారు. చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు మాట్లాడుతూ క్యాడెట్లు మరిన్ని క్యాంపుల్లో పాల్గొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. నూతన కార్యాలయాన్ని ఎన్‌సీసీ కేర్‌టేకర్ ఏజీబీ శంకర్ నేతృత్వంలో క్యాడెట్లు చక్కగా ఆధునీకరించడంపై అభినందించారు. నీరజ్‌కుమార్ కళాశాలలోని జువాలజీ మ్యూజియం, ఇండోర్ బ్యాడ్మింటన్ స్టేడియం, పలు విభాగాలను సందర్శించి, కళాశాలకు అవసరమైన సహాయాన్ని ఎన్‌సీసీ తరఫున చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.కృష్ణకుమారి, ఇతర కళాశాలల ఎన్‌సీసీ సిబ్బంది, క్యాడెట్లు పాల్గొన్నారు.

తల్లీకొడుకుల అదృశ్యం



రమ



ఫాల్గుణ్

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో తల్లీకొడుకులు అదృశ్యమైన ఘటన వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం కప్పరాడలో నివసిస్తున్న మూల ధర్మారావుకు భార్య రమ, ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండో కుమారుడు ఫాల్గుణ్ పుట్టిన రోజు కోసం దుస్తులు కొనడానికి భర్త దగ్గర రూ.1,000 తీసుకుని చిన్న కుమారుడితో కలిసి ఈ నెల 20న భార్య రమ బయటకు వెళ్లింది. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో భర్త ధర్మారావు చుట్టుపక్కల ప్రాంతాల్లో, బంధువుల ఇళ్ల వద్ద అంతటా వెతికారు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా.. మిస్సింగ్ కేసు నమోదు చేశారు. వారి ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశా రు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ ప్రకాష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం జగన్‌తో విశాఖ నగరాభివృద్ధి

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ
- 18వ వార్డులో విస్తృత ప్రచారం



18వ వార్డులో ఆటోడ్రైవర్‌కు పథకాల కరపత్రం అందిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీ కాలనీ: వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. జనం కోసం.. జనంలోనే పేరిట చేపట్టిన పాదయాత్ర శుక్రవారం 18వ వార్డులో కొనసాగింది. ప్రజలు నీరాజనాలు అందుకుంటూ తూర్పు నియోజకవర్గంలో విస్తృతంగా ఈ యాత్ర కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఎంవీవీ 68వ రోజు 18వ వార్డులో ఎంవీపీ కాలనీ సెక్టార్–10లో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమాన్ని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజాకర్షక పాలనను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి ఇంటికి మంచిచేసిందన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మరోసారి ప్రజలు వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలన్నారు. సీఎం జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయడం ద్వారా విశాఖ అంతర్జాతీయ నగరంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పద్మకు ఎంపీ ఎంవీవీ పరామర్శ

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 18వ వార్డు ప్రియదర్శిని కాలనీకి చెందిన పట్నానా పద్మను విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ పరామర్శించారు. పద్మ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురికావడంతో కాలు విరిగి చికిత్స చేయించుకుంటోంది. ఈ నేపథ్యంలో స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎంవీవీ శుక్రవారం పార్టీ శ్రేణులతో కలిసి ఆమె ఇంటికి వెళ్లి పరామర్శించి, ధైర్యం చెప్పారు.

పైడిమాంబకు ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు



పూజలో పాల్గొన్న భక్తులు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు డెయిరీ ఫారంలో పైడిమాంబ అమ్మవారి నవరాత్రి మహోత్సవాలు ఈ నెల 18 నుంచి కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రోజూ భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. శుక్రవారం అమ్మవారికి విశేష అలంకరణ చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదర్శనగర్, రవీంద్రనగర్, సుందర్‌నగర్, డెయిరీ ఫారం, ఇందిరానగర్ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ నెల 26వ తేదీతో ఈ ఉత్సవాలు ముగియనున్నాయి. ముగింపు వేడుకల ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

విద్యా సమాచారమ్

సోషల్ వర్క్‌లో శిరీషకు డాక్టరేట్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సోషల్ వర్క్ విభాగం పరిశోధకురాలు ఎం.శిరీషకు డాక్టరేట్ లభించింది. విభాగ ఆచార్యులు టి.శోభశ్రీ పర్యవేక్షణలో 'ఏ స్టడీ ఆన్ ఆక్యుపేషనల్ హెల్త్ హజార్డ్స్ ఆఫ్ కాంట్రాక్ట్ లేబర్స్ వర్కింగ్ ఇన్ శానిటరీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్, ఆంధ్రప్రదేశ్, ఇండియా' అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ వచ్చింది. ఈ మేరకు ఆమె శుక్రవారం ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులు స్వీకరించారు.

దేశ భవితను మార్చే శక్తి యువత సొంతం



విద్యార్థికి సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న వీసీ ప్రసాదరెడ్డి



విద్యార్థిని శాస్త్రీయ నృత్య ప్రదర్శన

ఏయూ క్యాంపస్: దేశ భవితను మార్చే శక్తి యువతకు ఉందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. శుక్రవారం ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ పూర్తి చేసిన తరువాత వాస్తవిక సమాజం విసిరే సవాళ్లకు సిద్ధం కావాలని సూచించారు. మార్కులు, ర్యాంకులు ప్రధానమేనని, అదే సమయంలో సమాజంతో సమన్వయం చేసుకుంటూ పనిచేయడం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు, విభాగాధిపతి ఆచార్య పి.మల్లికార్జునరావు, విభాగ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ అంశాలలో ప్రతిభచూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు బహూకరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

నీటితోనే మనుగడ సాధ్యం



ప్రసంగిస్తున్న సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు

ఏయూ క్యాంపస్: నీటితోనే భూమిపై జీవం మనుగడ సాధ్యపడుతుందని ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు అన్నారు. ఏయూ సైకాలజీ విభాగంలో సిఫా ట్రస్ట్, సైకాలజీ విభాగం సంయుక్తంగా జలవనరుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగోళంలో ఉన్న నీటిలో 97 శాతం సముద్రాలలో ఉండగా.. తాగడానికి ఉపయోగపడే జలం ఒక శాతం మాత్రమే ఉందన్నారు. పర్యావరణశాస్త్ర విభాగం విశ్రాంత ఆచార్యుడు ఎ.జె.సాల్మన్‌రాజు మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు నీటి లభ్యత ఎలా అనే దిశగా ఆలోచన చేసి ప్రణాళికతో పనిచేయడం, పరిరక్షించుకోవడం జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో సైకాలజీ విభాగాధిపతి ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, ఆచార్య ఎస్.ఎ.డి.పాల్, గ్రీన్ క్లైమేట్ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం, సిఫా ట్రస్ట్ డైరెక్టర్ డాక్టర్ శశిప్రభ, సంస్థ ప్రతినిధులు రామలక్ష్మి, ప్రసాద్, సుబ్బలక్ష్మి తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా నీటి సంరక్షణను తెలిపే ప్లకార్డులు ప్రదర్శించారు.